E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 20-02-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక:50 పేజీలు–6 www.ekaburu.com



మాతో ఒప్పందం చేసుకోండి.. లేదంటే..
.. ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక » 2లో

తెలంగాణలో మహిళలకు రూ.2,500

## పింఛన్ల పెంపుపై కసరత్తు



- ఈనెల 23న ముఖ్యమంత్రి రేవంత్ అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం
- ఈనెల 26 నుంచి అసెంబ్లీ సమావేశాలు
- అసెంబ్లీలో 28న 2026-–27 వార్షిక బడ్జెట్
- అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్లో పథకాల ప్రకటన
- ఈసారి బడ్జెట్లో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్ద పీట
- పెండింగ్ హామీల కోసం భారీగా నిధులు కేటాయింపు


**ఈ కబురు, హైదరాబాద్ ;**
సీఎం రేవంత్ మరో ఎన్నికల హామీ అమలు దిశగా కసరత్తు చేస్తున్నారు. కాంగ్రెస్ ఏర్పాటు అయిన తరువాత వరుసగా పథకాలను అందిస్తున్నారు. ఇప్పుడు, పెండింగ్ లో ఉన్న రెండు పథకాలను అమలుకు సిద్ధమవుతున్నారు. మహిళలకు 2, 500, పెన్షన్లు 4 వేలకు పెంపు పైన ప్రకటనకు తుది కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 28న అసెంబ్లీలో ప్రవేశ పెట్టే బడ్జెట్ లో ప్రకటన దిశగా చర్చలు సాగుతున్నట్లు సమాచారం.తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. 28న 202627 వార్షిక బడ్జెట్ ను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టనుంది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. తరువాయి 2లో



## ఏఐ మనల్ని కాదు..
## మనం ఏఐని శాసించాలి

- ఆలోచనలకు అందనంత దూరంలో కృత్రిమ మేధ
- ఏఐ వినియోగం చట్టబద్ధంగా ఉండాలి
- భారత్ కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది
- భారత్ ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్ర గా నిలుస్తుంది
- ప్రజల సంక్షేమం.. శ్రేయస్సే మన బెంచ్ మార్క్
- మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలి; ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

**ఈ కబురు**
"కృత్రిమ మేధ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' ) లో ప్రధాని మోదీ గురువారం ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు."



**ఏఐకి పరివర్తన శక్తి..**
''ప్రపంచంలోనే ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉంది. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్ ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుంది. కృత్రిమ మేధకు (Artificial intelligence) పరివర్తన శక్తి ఉంది. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుంది. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో ఉన్నాం. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న. ప్రజల సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు. మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలి. కృత్రిమ మేధ మనల్ని కాదు.. మనం ఏఐని శాసించాలి'' అని మోదీ వివరించారు. తరువాయి 2లో



ఈ సారైనా.. హామీల అమలుకు
### నిధులు కేటాయించండి: కేటీఆర్

ఈ కబురు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 95శాతం పెండింగ్‌లో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. గడిచిన రెండు బడ్జెట్లలో హామీల అమలుకు కేటాయింపులు చేయలేదని,



మంత్రుల అవినీతి చిట్టా బయటపెడతాం
### బండి సంజయ్

**ఈ కబురు, హైదరాబాద్:**
మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల చెంపచెల్లుమనిపించామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ బరితెగించి కాంగ్రెస్‌తో కుమ్మక్కైందని విమర్శించారు. "భాజపాను అడ్డుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కుమ్మక్కయ్యాయి.



పంచుకుంటూ పోతే ఒక్క పైసా మిగలదు
.. తమిళనాడు 'ఉచిత విద్యుత్'పై
### సుప్రీం ఆగ్రహం

ఈ కబురు : ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల ముందే రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి పథకాలు ఎందుకు తీసుకొస్తున్నాయని ప్రశ్నించింది.

### భారత్‌లో మార్పుల వేగానికి ఆశ్చర్యపోతున్నా ..సుందర్ పిచాయ్



ఈ కబురు : ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్' (India AI Impact Summit)లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. .... 2లో

జీహెచ్‌ఎంసీ విభజనపై
## హైకోర్టు ఆగ్రహం



**ఈ కబురు, హైదరాబాద్ ;**
జీహెచ్‌ఎంసీని రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా విభజించిన విషయం తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు గ్రేటర్ సైబరాబాద్, గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది.కాగా జీహెచ్‌ఎంసీ విభజనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తరువాయి



ఏఐపై ఏటా అంతర్జాతీయ సదస్సు
## గుటెరస్ వెల్లడి

ఈ కబురు : ఏఐని నియంత్రించడం ఐరాస పని కాదని, కానీ ఏటా అన్ని దేశాలు, పౌర సమాజాలు, ప్రైవేటు కంపెనీలతో కలిసి అంతర్జాతీయ ఏఐ సదస్సు నిర్వహించాలని నిర్ణయించామని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ఏఐ నిర్మాణంలో 3 కీలక వ్యవస్థలను గుర్తించామని వెల్లడించారు. అత్యున్నత స్థాయి స్వతంత్ర అంతర్జాతీయ సైంటిఫిక్ ప్యానల్ అని, ఇందులో ప్రపంచం నలుమూలల నుంచి 40 మంది నిపుణులను నియమించామని తెలిపారు. తరువాయి 2లో



## కర్రెగుట్టలో మరోసారి భారీ ఎన్‌కౌంటర్
.. ఐదుగురు మావోయిస్టులు మృతి

ఈ కబురు, చర్ల: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల వివరాలను అధికారవర్గాలు వెల్లడించాల్సి ఉంది. తరువాయి 2లో

## గవర్నర్ జోక్యం చేసుకోవాలి: హరీశ్‌రావు



ఈ కబురు, ఆదిలాబాద్ : మున్సిపల్ ఛైర్ పర్సన్ ఎన్నికల్లో పలు చోట్ల అరాచకాలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ నేతలకు పోలీసులు వత్తాసు పలికారని, దీనిపై ఎన్నికల కమిషన్ సైతం పట్టనట్లుగా వ్యవహరించడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు. .... 2లో

### కృత్రిమ మేధ ఆవిష్కరణలకు వేదికగా తెలంగాణ: మంత్రి శ్రీధర్‌బాబు



ఈ కబురు, ఢిల్లీ: కృత్రిమ మేధ ఆవిష్కరణలకు తెలంగాణ వేదికగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. పెట్టుబడిదారులకు ఐటీ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఢిల్లీలో నిర్వహిస్తున్న ఏఐ సమిట్‌లో మంత్రి పాల్గొన్నారు. అమెరికా, ఇండియా వాణిజ్య మండలి ప్రతినిధులతో చర్చలు జరిపారు. .... 2లో

## 'సర్'కు సిద్ధంగా ఉండండి
.. 22 రాష్ట్రాలకు ఈసీ లేఖ



ఈ కబురు : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియను దేశ వ్యాప్తంగా చేపట్టేందుకు ఎన్నికల సంఘం ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో వీటికి సంబంధించిన సన్నాహకాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచించింది. .... 2లో

### కవిత 'బీఆర్ఎస్' అనబోయి 'బీజేపీ' అన్నట్లున్నారు: రామచందర్‌రావు



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్తగా పార్టీ స్థాపిస్తే.. భూస్థాపితమయ్యేది బీఆర్ఎస్‌యేనని, భాజపా కాదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు .... 2లో

## అపార ధైర్యసాహసాలకు ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ : పల్లపు సురేందర్

**నల్లగండ్లలో ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు**



శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో పల్లపు సురేందర్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

అపార ధైర్యసాహసాలకు ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ అని, ఆయన ధైర్యం, పరాక్రమం, దేశభక్తి ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని పల్లపు సురేందర్ ఆధ్వర్యంలో నల్లగండ్ల డివిజన్ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు పల్లపు సురేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ హైందవ ధర్మ రక్షకుడు, అపార ధైర్యసాహసాలకు ప్రతీక అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యం, పరాక్రమం, దేశ భక్తి మనందరికీ స్ఫూర్తిదాయకన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొంది దేశ భక్తి, సేవా భావంతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగండ్ల డివిజన్ నాయకులు, కార్యకర్తలతో పాటు నల్లగండ్ల గ్రామ యువజన విభాగం సభ్యులు, స్థానికులు, యువత పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న పల్లపు సురేందర్

## దేశభక్తి, వీరత్వానికి మారుపేరు ఛత్రపతి శివాజీ మహారాజ్ :గంగల రాధాకృష్ణ యాదవ్

**ఇజ్జత్ నగర్ లో ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు**



రవికుమార్ యాదవ్ తో కలిసి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో రాధాకృష్ణ యాదవ్



ఛత్రపతి శివాజీ మహారాజ్ కు నివాళులర్పిస్తున్న రాధాకృష్ణ యాదవ్ తదితరులు

ఈకబురు, శేరిలింగంపల్లి : భరతమాత ముద్దుబిడ్డ ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశభక్తికి, వీరత్వానికి మారుపేరని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు గంగల రాధాకృష్ణ యాదవ్ అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఇజ్జత్ నగర్ మీనాక్షి స్కై లైన్ వద్ద గల శివాజీ సర్కిల్ లో గంగల రాధాకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి రవికుమార్ యాదవ్ తో కలిసి గంగల రాధాకృష్ణ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ,శివాజీ మహారాజ్ తన 17 ఏళ్ల చిరుప్రాయంలోనే యుద్ధం చేసి కోటలను గెలుస్తూ, మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, వారి దురాగతాలకు చరమగీతం పాడారని గుర్తుచేశారు. ధర్మ పరిరక్షణ, స్త్రీ గౌరవం, సమర్థ పరిపాలన, ప్రజా సంక్షేమానికి ఆయన చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శమని తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత హిందూ ధర్మ పరిరక్షణకు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, బాలు నాయక్, నరేష్ రెడ్డి, శ్రీశైలం, కుమార్, వేణుగోపాల్ రెడ్డి, మోహన్ నాయక్, భారతి, బలమ్మ, సాలమ్మ, నాగమ్మ, యశోథ్, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాలికకు గంజాయి తాగించి.. ఆపై ముగ్గురు రౌడీషీటర్ల అత్యాచారం

**ఈ కబురు, హైదరాబాద్ (నార్సింగి): నగరంలోని నార్సింగి పీఎస్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. బాలికకు గంజాయి తాగించి మత్తులో ఉండగా ముగ్గురు రౌడీషీటర్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలికి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. నిందితులు ముగ్గురూ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.**



# కోట్ల నిధులతో గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధి

## ..తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**రాయదుర్గంలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్ల పనుల పరిశీలన**



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



స్థానికులతో సమావేశమై సమస్యలు తెలుసుకుంటున్న దృశ్యం

**ఈ-కబురు, శేరిలింగంపల్లి:**

గత ఐదేళ్ల కాలంలో వందల కోట్ల రూపాయల నిధులతో గచ్చిబౌలి డివిజన్ లో అభివృద్ధి పనులు చేపట్టామని, గ్రేటర్ హైదరాబాద్ లోని అత్యధిక నిధులతో గచ్చిబౌలిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేసామని గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గంలో 48 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం గంగాధర్ రెడ్డి స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ నాణ్యతా విషయంలో ఎక్కడా రాజీ పడకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని, నూతనంగా నిర్మించిన అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని అన్నారు.భవిష్యత్తులో కాలనీ వాసులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు.

అనంతరం కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలియజేశారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో ప్రతి కాలనీ,బస్తీలో ప్రజలకు మెరుగైన మౌళికవసతులు కల్పించడమే ప్రధాన ద్యేయంగా ముందుకు సాగుతున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ నిఖిల్, గచ్చిబౌలి డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, సీనియర్ నాయకులు సురేందర్ ముదిరాజ్, నరేం దర్ ముదిరాజ్, అశోక్ ,నందు, సంజీవ, దయాకర్, నరేందర్ యాదవ్, శ్యామ్ యాదవ్, దుర్గా రామ్, సుమన్, వర్క్ ఇన్స్పెక్టర్ బిక్షపతితో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకం:ఆంజనేయులు సాగర్



శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు స్థానికులతో కలిసి అంజనేయులు సాగర్



శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు స్థానికులతో కలిసి అంజనేయులు సాగర్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్‌లో స్థానిక యువకులు సాయి,గురు, విశాల్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ హాజరై శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ హిందూ సమాజ రక్షణ కోసం చేసిన పోరాటం, ఆయన పరాక్రమం, నాయకత్వ గుణాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ధర్మ పరిరక్షణ, స్వాభిమాన రక్షణ కోసం ఆయన చూపిన ధైర్యం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. ఇలాంటి మహానుభావుల జయంతి వేడుకలు యువతలో దేశభక్తిని, సేవా భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నందు, సిద్దిక్ నగర్ మాజీ అధ్యక్షులు బసవరాజ్, సిద్దిక్ నగర్ కాలనీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, నాయకులు రాము, రవి యాదవ్, ముప్పిడి శ్రీను, సాగర్, ఆనంద్, దిలీప్, విజయ్ కుమార్ తో పాటు సిద్దిక్ నగర్ యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం:ముత్తోజు ఆమని

**అంజయ్య నగర్ లో ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు**



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముత్తోజు అమని తదితరులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

ఛత్రపతి శివాజీ మహారాజ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శవంతమని, ఆయన పరాక్రమం, నాయకత్వ లక్షణాలు ఎన్నటికీ స్ఫూర్తిదాయకమని అంజయ్యనగర్ డివిజన్ యువ నాయకురాలు ముత్తోజు ఆమని అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని అంజయ్యనగర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ లో నిర్వహించిన జయంతి వేడుకలకు ముత్తోజు ఆమని ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముత్తోజు అమని మాట్లాడుతూ ఛద్రవతి శివాజీ మహారాజ్ వంటి మహానుభావుల జయంతి వేడుకలు నేటి యువతలో దేశభక్తిని, సేవా భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ధర్మ పరిరక్షణ, స్వాభిమాన రక్షణ కోసం ఆయన చూపిన ధైర్యం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. శివాజీ మహారాజ్ స్ఫూర్తితో నేటి యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో నడుస్తూ అంజయ్య నగర్ డివిజన్ ప్రజల సంక్షేమం కోసం ముందుకు సాగుతానని, డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజయ్యనగర్ డివిజన్ పరిధిలోని యువజన విభాగం సభ్యులు, కాలనీ వాసులు, స్థానికులు పాల్గొన్నారు.



శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో ముత్తోజు అమని

## మూడేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం.. పోలీసుల అదుపులో నిందితుడు

ఈ కబురు : విశాఖ జిల్లాలో దారుణం జరిగింది. మూడేళ్ల చిన్నారిపై యోగి అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. పెదగంట్యాడ మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తినుబండారాలు ఇస్తానని చెప్పిన కామాంధుడు చిన్నారిని తీసుకెళ్లాడు. అనంతరం బాలిక ఏడుస్తుండటంతో తల్లి గమనించింది. దీంతో తల్లిదండ్రులు న్యూపోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

**మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం...** ఈ ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విశాఖపట్నం సీపీతో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఫోన్‌లో మాట్లాడారు. ఇలాంటివి సమాజానికి మచ్చగా నిలుస్తాయన్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. నిందితుడికి కఠినశిక్ష పడేలా మహిళా కమిషన్ పర్యవేక్షిస్తుందని శైలజ తెలిపారు.



# సంస్థల్లో AI వినియోగం.. ప్రస్తుతానికి ప్రభావం తక్కువే!




అనేక రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం కీలకంగా మారుతున్న నేపథ్యంలో.. అవి ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చనే ఆందోళనలు నెలకొంటున్న విషయం తెలిసిందే. అయితే, దీనివల్ల తక్షణ ప్రభావం అంతగా ఏమీ ఉండదని తాజా అధ్యయనం వెల్లడించింది. ఏఐ వచ్చిన తర్వాత కూడా తమ సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య లేదా ఉత్పాదకతలో ఎలాంటి తేడా రాలేదని 90శాతం సంస్థలు పేర్కొన్నాయి. ఈ సాంకేతికతను స్వల్పంగానే ఉపయోగిస్తున్నామని, ఏఐని విస్తృత స్థాయిలో వాడటం లేదని చెబుతున్నాయి.

కృత్రిమ మేధ ప్రభావానికి సంబంధించి 'నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ రీసెర్చ్ (NBER) ఇటీవల అధ్యయనం చేసింది. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్న సీఈఓలు సహా దాదాపు 6వేల మంది ఉన్నత స్థాయి ఎగ్జిక్యూటివ్‌లను సర్వే చేసింది. గత మూడేళ్లలో దీని వల్ల తమ సంస్థల్లో ఉపాధి అవకాశాలపై ప్రభావం లేదని 90శాతం మంది చెప్పగా.. 89శాతం మంది ఉత్పాదకతపై ఎటువంటి ప్రభావం చూపలేదని చెప్పారు. ప్రభావం తక్కువే అయినప్పటికీ.. ఏఐ ప్రయోజనాలు ఆశాజనకంగానే ఉండనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. వచ్చే మూడేళ్లలో ఉత్పాదకతను 1.4శాతం పెంచుతుందని విశ్వసిస్తున్నామని, ఇదే వ్యవధిలో 75శాతం కార్యకలాపాల్లో ఏఐ సాంకేతికత ఉపయోగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నాలుగు దేశాల్లో దాదాపు 25 కోట్ల మంది ఉద్యోగులు ఉండగా.. ఏఐ కారణంగా ఇక్కడి కంపెనీల్లో 2028 నాటికి 17.5లక్షల ఉద్యోగాలు తగ్గుతాయని తాజా అధ్యయనం అంచనా వేసింది. ప్రస్తుతం ఈ కంపెనీలు టెక్స్ట్ జనరేషన్, విజువల్ కంటెంట్ క్రియేషన్ కోసం ఏఐ ఆధారిత లాంగ్వేజ్ మోడల్‌లను ఉపయోగిస్తున్నాయి. సంస్థల్లో ఏఐ సాంకేతికత వినియోగం వల్ల పెద్దగా ప్రయోజనాలు లేవని గతంలో ఎంఐటీ అధ్యయనం కూడా అంచనా వేసింది. ఏఐ సాంకేతికతలను అమలు చేస్తున్నప్పటికీ పెట్టుబడిపై సున్నా రాబడి వస్తోందని 95శాతం సంస్థలు చెప్పిన విషయం తెలిసిందే.

# ఎలక్ట్రిక్ ప్రపంచంలో సరికొత్త విప్లవానికి శ్రీకారం:గంగాధర్ రెడ్డి

## గౌలిదొడ్డిలో మారుతి ఈ విటారా ఆవిష్కరణ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

మారుతి సుజుకి తొలి ఎలక్ట్రిక్ వాహనం ఈ విటారా ను గురువారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డిలో గల నెక్సా షోరూమ్ లో గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. మారుతి సుజుకి సాయి సర్వీస్ సీఈఓ ఉదయ్ కులకర్ణి, టెరిటరీ సేల్స్ మేనేజర్ సుభాష్ చంద్ర, ఇండస్ ఇండ్ బ్యాంక్ ప్రతినిధి మూర్తి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఉదయశ్రీ, చోళమండలం ఫైనాన్స్ ప్రతినిధి స్వామి, సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్ మోహన్ నాయక్ తో కలిసి గంగాధర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ,గ్రీన్ ఎనర్జీ వినియోగంలో ఎలక్ట్రిక్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, మారుతి సుజుకి వంటి ప్రముఖ సంస్థ ఎలక్ట్రిక్ రంగంలో అడుగు పెట్టడం దేశ ఆటోమొబైల్ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలికిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ ప్రతినిధులు, సీనియర్ నాయకులు ప్రసాద్ , సుమన్, నగేష్, బాబు, రమేష్ నరసింహ, మణికంఠ, శ్రీను, సుబ్రమణ్యం,తదితరులు పాల్గొన్నారు.




నూతన కార్ ను ఆవిష్కరిస్తున్న గంగాధర్ రెడ్డి తదితరులు

# మార్కెట్‌కు యుద్ధ భయాలు.. ₹8 లక్షల కోట్లు ఆవిరి!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమయ్యాయి. బ్యాంకింగ్, మెటల్, ఆటో, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు కుదేలయ్యాయి. ఇరాన్‌పై ఏ క్షణంలోనైనా అమెరికా దాడి చేస్తుందన్న భయాలు, ఫెడ్ వడ్డీ రేట్లపై గందరగోళం కారణంగా సూచీలు నేలచూపులు చూశాయి. దీంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. మదుపర్ల సంపద దాదాపు రూ.8 లక్షల కోట్లు ఒక్క రోజులోనే ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.472 లక్షల కోట్ల నుంచి రూ.464 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఓ దశలో 1400 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 25,500 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,969.82 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,734.25) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపు లాభాల్లో కదలాడిన సూచీ.. క్రమంగా నష్టాల్లోకి జారుకుంది. ఈ క్రమంలో ఇంట్రాడేలో 82,264.20 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1236.11 పాయింట్ల నష్టంతో 82,498.14 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 365 పాయింట్ల నష్టంతో 25,454 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్కటంటే ఒక్కటీ లాభపడలేదు. ఇండిగో, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

**--ప్రధాన కారణాలు ఇవే..**ఇరాన్‌పై ఏ క్షణంలోనైనా అమెరికా దాడికి పాల్పడొచ్చనే భయాలు మన మార్కెట్ సూచీల పతనాన్ని శాసించాయి.

ఓ వైపు పశ్చిమాసియాలో అమెరికా తన సైనిక బలాన్ని మోహరిస్తుండగా.. ఇరాన్ తన అణుస్థావరాలను రక్షించుకొనే పనిలో పడింది. దీనికితోడు ఉక్రెయిన్ రష్యా మధ్య అమెరికా మధ్యవర్తిత్వంలో జరుగుతున్న శాంతి చర్చలు కొలిక్కి రాకపోవడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా ఫెడ్‌కు సంబంధించిన మినిట్స్ తాజాగా బయటికొచ్చాయి. వడ్డీ రేట్ల తగ్గింపు విషయంలో ఫెడ్ అధికారుల విషయంలో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. తదుపరి ద్రవ్యోల్బణ గణాంకాలు వచ్చేంత వరకు వేచి చూడాలని కొందరు అభిప్రాయపడుతుండగా.. మరికొందరు మాత్రం ద్రవ్యోల్బణం తిరోగమనం పట్టేంత వరకు వడ్డీ రేట్లు తగ్గించకూడదన్న అభిప్రాయంతో ఉన్నారు. దీర్ఘకాలం పాటు అమెరికా వడ్డీ రేట్లు తగ్గించకపోతే భారత్ వంటి వర్ధమాన మార్కెట్‌లకు నిధుల ప్రవాహం తగ్గుముఖం పడుతుంది. పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకొన్న వేళ అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్ల మార్కును దాటింది. దిగుమతులపై ప్రధానంగా ఆధారపడే మన దేశానికి ఇది ప్రతికూలాంశం. పైగా సెన్సెక్స్, నిఫ్టీ ఇటీవల వరుస లాభాల వేళ మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, మార్కెట్ సూచీలను ముందుకు నడిపించే పాజిటివ్ అంశాలేవీ లేకపోవడంతో మార్కెట్ సూచీలు భారీగా నష్టపోయాయి.




# అనుమతి లేకుండా భారత్ వీడను ..అనిల్ అంబానీ



ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ గురువారం సుప్రీం కోర్టుకు తెలిపారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (ADAG) ప్రమేయం ఉన్న రూ.40 వేల కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసుల్లో ఏజెన్సీల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనిల్ అంబానీ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని, ఈ కేసుల్లో సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని కోరుతూ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన పిల్‌కు ప్రతిస్పందనగా ఆయన ఈమేరకు అఫిడవిట్ దాఖలు చేశారు. ''ఈ కేసుల్లో దర్యాప్తు మొదలు.. గతేడాది జులై నుంచి నేను దేశం విడిచి వెళ్లలేదు. ప్రస్తుతానికి విదేశాలకు వెళ్లే ఉద్దేశం, ప్రణాళికలేవీ లేవు. ఒకవేళ విదేశీ ప్రయాణం చేయాల్సి వస్తే.. కోర్టు నుంచి ముందస్తు అనుమతి తీసుకుంటాను. సంబంధిత కేసుల్లో దర్యాప్తు సంస్థలకు అత్యంత నిజాయతీతో పూర్తిగా సహకరిస్తున్నాను. మున్ముందు కూడా కొనసాగిస్తాను'' అని అనిల్ అంబానీ తెలిపారు. చట్ట ప్రక్రియ నుంచి తప్పించుకునే ఉద్దేశం తనకు లేదని, తాను అలాంటి వ్యక్తిని కాదని పేర్కొన్నారు. మనీలాండరింగ్ కేసులో ఈ నెల 26న విచారణకు హాజరు కావాలని ఈడీ సమన్లు జారీ చేసిందని, హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన ప్రవర్తన పారదర్శకంగా, కేసుల దర్యాప్తునకు సహకరించే విధంగా ఉందని చెప్పేందుకే ఈ అఫిడవిట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ కేసుల దర్యాప్తులో జాప్యంపై ఈ నెల 4న సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దర్యాప్తును ముమ్మరం చేయాలని సీబీఐ (CBI), ఈడీలను ఆదేశించింది.

# స్టూడెంట్‌స్‌కు అడోబ్ గుడ్‌న్యూస్..ఈ యాప్స్ ఫ్రీ

Adobe

ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అడోబ్ గుడ్‌న్యూస్ చెప్పింది. తన AIఆధారిత క్రియేటివ్, ప్రొడక్టివిటీ టూల్‌స్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపింది. భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో భాగంగా ఈ ప్రకటన చేసింది. ఈ ఆఫర్‌లో భాగంగా అడోబ్ ఫోటోషాప్, అక్రోబాట్, అడోబ్ ఫైర్‌ఫ్లై టూల్‌స్‌ను భారత్‌లోని గుర్తింపు పొందిన విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉచితంగా పొందొచ్చు. సాఫ్ట్‌వేర్ యాక్సెస్‌తో పాటు, ఈ టూల్స్ ఉపయోగించడంపై శిక్షణ, కరిక్యులమ్, సర్టిఫికేషన్ కూడా అడోబ్ అందించనుంది. కంటెంట్ క్రియేటర్ ల్యాబ్ సదుపాయం ఉన్న 15వేల స్కూళ్లు, 500 కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఈ సౌలభ్యం లభిస్తుంది. దీంతో పాటు నాస్కామ్‌తో కలిసి AIఫస్ట్ లెర్నింగ్ కోర్సులు, సర్టిఫికేషన్లను కూడా అడోబ్ అందించనుంది. దీన్ని అడోబ్ వ్యూహాత్మక పెట్టుబడిగా అభివర్ణించింది. భారతదేశంలోని లక్షలాది మంది విద్యార్థులకు సృజనాత్మకతను పెంచేందుకు అడోబ్ తనవంతు కృషి చేస్తోందని, AI నైపుణ్యాలను పొందడంలో సహకరిస్తోందని అడోబ్ ఛైర్మన్, సీఈఓ శంతను నారాయణ్ పేర్కొన్నారు.


# గూగుల్ నుంచి లిరియా3 మ్యూజిక్ జనరేషన్ మోడల్

Google DeepMind

గూగుల్‌కు చెందిన ఏఐ రీసెర్చ్ ల్యాబ్ గూగుల్ డీప్‌మైండ్.. లిరియా 3 పేరుతో ఏఐ మ్యూజిక్ జనరేషన్ మోడల్‌ను విడుదల చేసింది. సింపుల్ టెక్స్ట్ ఆధారంగా హై క్వాలిటీ మ్యూజిక్ జనరేట్ చేయడం దీని ప్రత్యేకత. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు ఈ సదుపాయం లభిస్తుంది. ఈ మ్యూజిక్ జనరేషన్ ఫీచర్‌ను సోషల్ మీడియా పోస్టులు, వీడియో, డిజిటల్ స్టోరీ టెల్లింగ్‌కు వినియోగించుకోవచ్చు. ఈ మేరకు గూగుల్ డీప్‌మైండ్ బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. లిరియా 3లో మూడ్, టెంపో, ఇన్‌స్ట్రుమెంట్ ఆధారంగా 30 సెకన్ల మ్యూజిక్ ట్రాక్‌ను జనరేట్ చేయొచ్చు. ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసి కూడా ఆడియోను క్రియేట్ చేయమని చెప్పొచ్చు. సూర్యోదయం లేదా ట్రావెల్ ట్రిప్‌నకు సంబంధించిన ఫొటో/ వీడియో అప్‌లోడ్ చేయగానే దానికి అనుగుణంగా మ్యూజిక్‌ను జనరేట్ చేసి ఇస్తుంది. లిరియా 3 నుంచి వచ్చే ఆడియో మ్యూజిక్‌ను గుర్తుపట్టేలా ఇన్‌విజిబుల్ వాటర్‌మార్క్ ఉంటుంది. ఇంగ్లీష్, హిందీ, జర్మనీ, స్పానిష్, ఫ్రెంచ్, కొరియన్ వంటి భాషల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంది.

18 ఏళ్లపైబడిన వారు జెమినైలో పరిమితి మేరకు వినియోగించుకోవచ్చు. గూగుల్ ఏఐ ప్లస్, ప్రో, అల్ట్రా సబ్‌స్క్రైబర్లకు ఎక్కువసార్లు వినియోగించుకునే వీలుంది.

# ఏఐ రాకతో లేఆఫ్‌ల్లోనూ పోటీ ..హెచ్చరించిన అమెరికా వ్యాపారవేత్త



కృత్రిమమేధతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళన రోజురోజుకూ తీవ్రమవుతోంది. అమెరికా వ్యాపారవేత్త ఆండ్రూ యాంగ్ చేసిన వ్యాఖ్యలు అందుకు తగ్గట్టే ఉన్నాయి. రానున్న 1218నెలల్లో లక్షల ఉద్యోగాలు పోతాయని, వాటిల్లో భారీ సంఖ్యలో వైట్‌కాలర్ జాబ్స్ ఉంటాయని జోస్యం చెప్పారు. కోడర్స్, మార్కెటర్స్ (ప్రకటనల విభాగ సిబ్బంది), మిడిల్ మేనేజర్లు, కాల్ సెంటర్ సిబ్బంది అందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఒక సంస్థ తన ఉద్యోగుల సంఖ్యలో కోతపెడితే.. ప్రత్యర్థులు కూడా అలాంటి నిర్ణయాలు అమలు చేయాల్సిన ఒత్తిడి తలెత్తుందన్నారు. ''సిబ్బంది సంఖ్యను తగ్గించుకుంటే స్టాక్‌మార్కెట్ సానుకూలంగా స్పందిస్తుంది. లేకపోతే భిన్నంగా ఉంటుంది. దాంతో ఇదొక పోటీగా మారుతుంది'' అని యాంగ్ అభిప్రాయం వ్యక్తంచేశారు. నాన్ టెక్నికల్ విభాగంలో కూడా ఏఐ ప్రభావం ఉంటుందని యాంగ్ వెల్లడించారు. ''డ్రై క్లీనర్, డాగ్ వాకర్, హెయిర్‌స్టైలిస్ట్ లాంటి ఉద్యోగాల్లో కొందరు ఉన్నారనుకుందాం. ఇతర ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నవారికి ఉపాధిపోతే ఆ ప్రభావం ఈ చిన్న ఉద్యోగస్థులపై పడుతుంది. ఉతకడానికి బట్టలు ఇవ్వరు. వారి కుక్కలను వారే తీసుకువెళ్తారు.

సెలూన్‌కు వెళ్లడం తగ్గిస్తారు'' అని పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. కోడ్‌ను ఏఐ మోడల్స్ రాస్తుంటే ఇంజినీర్లకు ఏం పని మిగులుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ''కోడింగ్ అనేది ఉద్యోగంలో ఒక భాగం మాత్రమే. ఏఐ వ్యవస్థలకు సరైన ప్రాంప్ట్‌లు ఇవ్వడం, ఇతర బృందాలను సమన్వయం చేసుకోవడం, కస్టమర్లతో అనుసంధానం అవ్వడం, తర్వాత ఎలాంటి ఫీచర్‌ను తీసుకురావాలి..? అనే అంశాలపై రీసెర్చ్ చేయడం వంటి పనులు ఇంజినీర్లకు ఉన్నాయి'' అని ఏఐ నిపుణులు వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ప్రారంభించిన ఏడాదికే స్విగ్గీ స్నాక్ మూత




ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ తన 10 నిమిషాల ఫుడ్ డెలివరీ యాప్ స్నాక్ (Snacc)ను మూసివేసింది. ఈ వ్యాపారంలో ఆశించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో కార్యకలాపాలను నిలిపివేసింది. ప్రారంభించిన ఏడాదికే సేవలను ఆపేయడం గమనార్హం. దీర్ఘకాలంలో వృద్ధికి అవకాశం ఉన్న వ్యాపారాలపై దృష్టి పెట్టడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ అంతర్గత ఇమెయిల్‌లో పేర్కొంది. క్విక్‌కామర్స్ సంస్థలైన జెప్టో కేఫ్, బ్లింకిట్ బిస్ట్రోను ప్రారంభించడంతో స్విగ్గీ కూడా స్నాక్ యాప్‌ను గతేడాది జనవరిలో ప్రారంభించింది. స్నాక్స్, బేవరేజెస్, మినీ మీల్స్, కేక్స్, కుకీస్ వంటివి దీని ద్వారా విక్రయిస్తుంటారు. హోటళ్లు, రెస్టరంట్లు, కేఫ్‌లకు సరఫరా చేసే వెండర్ల నుంచి ఈ సంస్థలు ఆహార పదార్థాలను సేకరించి డార్క్‌స్టోర్ నుంచి సరఫరా చేస్తుంటారు. పరిమిత సంఖ్యలో అమ్ముడవ్వడం, లాభదాయకత పెద్దగా లేకపోవడంతో స్నాక్‌ను మూసివేయాలని స్విగ్గీ నిర్ణయం తీసుకుంది. గతేడాది మే నెలలో జొమాటో కూడా ఇలానే హోమ్‌స్టైల్ మీల్ సేవలను నిలిపివేసింది.

# కెమెరా ప్రియుల కోసం వివో వీ70, వీ70 ఎలైట్



ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో కెమెరా ప్రియుల కోసం దేశీయ మార్కెట్‌లోకి రెండు కొత్త స్మార్ట్‌ఫోన్లను లాంచ్ చేసింది. తన వీ సిరీస్‌లో వీ70, వీ70 ఎలైట్ పేరిట రెండు స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. ఇందులో వీ70 ఎలైట్ హైఎండ్ కాన్ఫిగరేషన్‌తో కూడిన ఫోన్. ఈ రెండు ఫోన్లూ జీస్ (Zeiss) పార్ట్‌నర్‌షిప్‌తో వస్తుండడం విశేషం. 6,500 ఎంఏహెచ్ బిగ్‌బ్యాటరీతో, స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్‌తో వస్తున్న ఈ ఫోన్ల వివరాలు ఇప్పుడు చూద్దాం. వివో వీ70, వీ70 ఎలైట్ రెండూ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజన్‌ఓఎస్ 6తో పనిచేస్తాయి. వీటికి నాలుగేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. రెండు ఫోన్లలోనూ 6.59 అంగుళాల వీఎం9 అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్ రేటుకు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తాయి. ఐపీ68, ఐపీ69 రేటింగ్‌తో వస్తున్నాయి. వివో వీ70లో స్నాప్‌డ్రాగన్ 7 జన్ 4 ప్రాసెసర్ అమర్చగా.. వీ70 ఎలైట్‌లో స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జన్ 3 చిప్‌సెట్‌ను అమర్చారు. రెండు ఫోన్లలోనూ జీస్ పార్ట్‌నర్‌షిప్‌తో కూడిన ట్రిపుల్ కెమెరా సెటప్ ఉంది. 50 ఎంపీ ప్రైమరీ కెమెరా, 50 ఎంపీ టెలి ఫొటోలెన్స్, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. రెండు ఫోన్లలోనూ 50 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇచ్చారు. 6,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 90W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో తీసుకొచ్చారు. ఈ ఫోన్ల బరువు 194 గ్రాములు. గూగుల్ పిక్సెల్ 10ఏ వచ్చేసింది.. ఈ కార్డుతో కొంటే ₹3 వేలు డిస్కౌంట్ E

ఇక ధర విషయానికొస్తే.. వివో వీ70 రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ+ 256జీబీ వేరియంట్ ధర రూ.45,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీ+ 256జీబీ వేరియంట్ రూ.49,999కు లభిస్తుంది. వీ70 ఎలైట్ మొత్తం మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. 8జీబీ+ 256జీబీ వేరియంట్ ధరను రూ.51,999గా కంపెనీ పేర్కొంది. 12జీబీ+ 256జీబీ వేరియంట్ ధర రూ.56,999, 12జీబీ+ 512 జీబీ వేరియంట్ ధర రూ.61,999గా నిర్ణయించింది. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్ కార్డుల పై 10 శాతం వరకు కంపెనీ డిస్కౌంట్ అందిస్తోంది. ఫ్లిప్‌కార్ట్, వివో ఆన్‌లైన్ స్టోర్లలో లభ్యం కానున్నాయి.

# ఏఐలో జియో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ..ముకేశ్ అంబానీ

మొబైల్ డేటా మాదిరిగానే కృత్రిమ మేధలోనూ సరికొత్త విప్లవాన్ని తీసుకొచ్చేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ వెల్లడించారు. ఇందుకోసం రూ. 10లక్షల కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించారు. దిల్లీలో జరుగుతోన్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ముకేశ్ అంబానీ పాల్గొని ప్రసంగించారు. ''ఏఐలో బెస్ట్ ఇంకా రావాల్సిఉంది. సుసంపన్న యుగానికి కృత్రిమ మేధ నాంది పలుకుతుంది. ఇది శక్తిని కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం చేస్తుందా..? లేదా ప్రజలందరికీ అవకాశం కల్పిస్తుందా అనే చర్చ నడుస్తోంది. ఇందులో విప్లవం తీసుకొచ్చేందుకు మేం పనిచేస్తాం. రానున్న 7 ఏళ్లలో రిలయన్స్‌తో కలిసి జియో ఇందులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇదేదో ఊహాజనిత పెట్టుబడి కాదు. దేశ నిర్మాణానికి ఈ వ్యయం ఉపయోగపడనుంది అని ముకేశ్ అంబానీ వెల్లడించారు. ''ఇంటర్నెట్ శకానికి భారత్‌ను జియో అనుసంధానం చేసింది. ఇప్పుడు ఇంటెలిజెన్స్ శకానికి కూడా మేం అనుసంధానకర్తగా ఉండాలనుకుంటున్నాం. ప్రతి పౌరుడికి, ప్రతి రంగానికి కృత్రిమ మేధను చేరవేస్తాం. సాంకేతిక రంగంలో సదుపాయా లను మెరుగుపర్చేందుకు జియో ఇంటెలిజెన్స్ నిర్విరామంగా పనిచేస్తోందని ముకేశ్ అంబానీ తెలిపారు.

# హైదరాబాద్ కేంద్రంగా ఏఐ విప్లవం

ఔషధ రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు తాము సిద్ధమవుతున్నామని సనోఫీ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (ఈవీపీ) మడేలిన్ రోచ్ ప్రకటించారు. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత సాయంతో ఔషధాల తయారీ కాలాన్ని సగానికి తగ్గించడమే కాకుండా, ప్రపంచంలోనే తొలి 'ఏఐ పవర్డ్ బయోఫార్మా' కంపెనీగా అవతరించడమే తమ లక్ష్యమని.. ఈ ప్రక్రియలో హైదరాబాద్ వెన్నెముకగా నిలిస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఆసియా 2026 సదస్సు రెండో రోజు ఆమె కీలకోపన్యాసం చేశారు. 'సాధారణంగా ఒక కొత్త మందు పరిశోధన నుంచి రోగులకు అందేందుకు పదేళ్ల సమయం పడుతుంది. ఏఐ సాంకేతికత వినియోగించడం ద్వారా ఈ కాలాన్ని అయిదేళ్లకు తగ్గించాలని సనోఫీ ఆశిస్తోంది. దీనికోసం సంస్థ వనరులలో 50 శాతాన్ని ఆవిష్కరణల కోసమే కేటాయిస్తున్నాం. సనోఫీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 5 ప్రధాన జీసీసీల్లో హైదరాబాద్ అత్యంత కీలకం. మరో 2,600 కొత్త ఉద్యోగాలు కల్పించేందుకు వీలుగా, ఈ కార్యాలయాన్ని విస్తరించినట్లు' తెలిపారు.

# యువతకు మృణాల్ ఠాకూర్ లవ్ సలహా




- ప్రేమ విషయంలో యువత ఓపికగా ఉండాలన్న మృణాల్ ఠాకూర్
- ప్రస్తుతం చిన్న గొడవలకే సంబంధాలను వదులుకుంటున్నారని ఆవేదన
- ప్రేమపై నమ్మకం కోల్పోవద్దని, అది ఓ అందమైన అనుభూతి అని సూచన
- 'దో దీవానే షెహర్ మే' చిత్ర ప్రమోషన్స్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు
- ఫిబ్రవరి 20న సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్‌ల సినిమా విడుదల

'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్, ప్రేమ విషయంలో నేటి యువతకు ఓ ముఖ్యమైన సందేశం ఇచ్చారు. ప్రేమను కాపాడుకోవాలంటే ఓపిక చాలా అవసరమని, దానిపై సులభంగా నమ్మకం కోల్పోవద్దని ఆమె సూచించారు. ప్రస్తుతం తన కొత్త చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

ఓ ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. "ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ప్రేమలో ఓపిక తగ్గిపోతోంది. అందుకే చాలామంది ఒకరినొకరు తేలిగ్గా వదులుకుంటున్నారు. మా సినిమాలో పాత్రల మాదిరిగా పాతకాలపు మనస్తత్వం ఉంటే బాగుంటుంది. చిన్న గొడవ వస్తే చాలు, వెంటనే ఒకరినొకరు బ్లాక్ చేసేస్తున్నారు. మా దారులు వేరు, మేం ఒకరికొకరం సెట్ కాము అని తేలిగ్గా చెప్పేసి సంబంధాలను వదులుకుంటున్నారు" అని అన్నారు.

"ప్రతి యువతీ యువకుడు ప్రేమను నమ్మాలని కోరుకుంటున్నాను. దయచేసి ప్రేమపై నమ్మకం వదులుకోవద్దు. అది చాలా అందమైన, అద్భుతమైన అనుభూతి. సరైన వ్యక్తి మీ జీవితంలోకి వస్తే, జీవితం సులభంగా మారుతుంది. అందుకే సరైన వ్యక్తి కోసం ఓపికగా ఎదురుచూడండి. అంతేకానీ తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు" అని యువతకు ఆమె సలహా ఇచ్చారు.

**ఇక 'దో దీవానే షెహర్ మే' చిత్రంలో మృణాల్‌తో పాటు సిద్ధాంత్ చతుర్వేది, సందీపా ధర్, ఆయేషా రజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంజయ్ లీలా భన్సాలీ, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 20న విడుదల కానుంది.**



## 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి సెకండ్ సింగిల్ ప్రోమో రిలీజ్



- 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పేరుతో రెండో పాట ప్రోమో రిలీజ్
- ఫిబ్రవరి 22న పూర్తి లిరికల్ వీడియో విడుదల
- పవన్, హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం
- దేవి శ్రీ ప్రసాద్ సంగీతం, ఆస్కార్ విజేత చంద్రబోస్ సాహిత్యం

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర బృందం నుంచి మరో అప్ డేట్ వచ్చేసింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాలోని రెండో పాట ప్రోమోను మేకర్స్ నేడు విడుదల చేశారు.

'ఆరా ఆఫ్ ఉస్తాద్' పేరుతో వస్తున్న ఈ రెండో పాట ప్రోమోను గురువారం విడుదల చేశారు. ఈ పూర్తి లిరికల్ వీడియోను ఫిబ్రవరి 22న విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ పాటకు ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ సాహిత్యం అందించగా, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చారు.

ఇక, ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించింది. 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి.

ఈ సినిమాలో పవన్ కల్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఆర్. పార్తిబన్, అశుతోష్ రాణా, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వేసవి సీజన్‌లో రాబోతున్న తొలి పెద్ద సినిమా ఇదే కావడంతో బాక్సాఫీస్ వద్ద సందడి ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

## ది కేరళ స్టోరీ 2'పై పిటిషన్.. నిర్మాత, సెన్సార్ బోర్డుకు హైకోర్టు నోటీసులు

'ది కేరళ స్టోరీ 2' (The Kerala Story 2) సినిమా విడుదలను నిలిపివేయాలని కోరుతూ కేరళ హైకోర్టులో గురువారం ఓ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, సెన్సార్ బోర్డు, ఈ చిత్ర నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. ఈ సినిమా ట్రైలర్ తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని, అది కేరళను భిన్నంగా ప్రాజెక్ట్ చేస్తోందంటూ శ్రీదేవ్ అనే బయోలజిస్ట్ పిటిషన్ దాఖలు చేశారు.

2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందింది 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'. టీజర్, ట్రైలర్లు విడుదలయ్యాక ఈ మూవీ కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిపై తాజాగా.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిపై స్పందించారు. ఈ సినిమాపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. దీన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. ఫిబ్రవరి 27న విడుదలకు సిద్ధమవుతుండగా.. నిర్మాతకు నోటీసులు జారీ కావడం మళ్లీ చర్చకు దారితీసింది




## సుకుమార్ డైరెక్షన్‌లోనే హీరోగా ఎంట్రీ.. కానీ: దేవిశ్రీ ప్రసాద్



ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ (డీఎస్పీ) నటుడిగా ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. 'ఎల్లమ్మ' (Yellamma) సినిమాతో హీరోగా పరిచయం కానున్నారు. ఇంతకుముందే ఈ మ్యూజిక్ డైరెక్టర్.. తెరపై సందడి చేయాల్సి ఉన్నా సాధ్యపడలేదు. డైరెక్టర్ సుకుమార్ (Sukumar) దేవిశ్రీ అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సుకుమార్ చిత్రాలన్నింటికీ డీఎస్పీనే మ్యూజిక్ డైరెక్టర్. ఆ స్నేహంతోనే దేవిశ్రీని నటుడిగా పరిచయం చేయాలని సుకుమార్ ప్లాన్ చేశారు. కానీ, తన తండ్రి మరణంతో దానిపై దృష్టి పెట్టలేకపోయానని, అందుకే ఆ ప్రాజెక్టు ఆగిపోయిందని దేవిశ్రీ ప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సుకుమార్‌తోపాటు ఇతర దర్శకులు త్రివిక్రమ్, హరీశ్ శంకర్, నిర్మాతలు దిల్ రాజు తదితరులు యాక్టింగ్ విషయంలో ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు.

**నెలలో పది రోజులు..**

ఎట్టకేలకు 'ఎల్లమ్మ'తో దేవిశ్రీ యాక్టింగ్ డ్రీమ్ నెరవేరుతోంది. హాస్య నటుడు, 'బలగం'తో సత్తా చాటిన దర్శకుడు వేణు యెల్దండి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దైవిక అంశాలతో ముడిపడిన ఈ గ్రామీణ నేపథ్య కథలో డీఎస్పీ.. డప్పు కళాకారుడిగా కనిపించనున్నారు. ఈ సినిమా గురించి ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

''ఎల్లమ్మ' కోసం నిర్మాత దిల్ రాజు నన్ను సంప్రదించినప్పుడు.. 'ఈ సినిమా కోసం నువ్వు పది రోజులు కేటాయిస్తే చాలు. ఆ మేరకు మేం షెడ్యూల్స్ ప్లాన్ చేసుకుంటాం. మిగిలిన సమయంలో మళ్లీ నువ్వు సంగీతాన్ని కొనసాగించొచ్చు' అని చెప్పారు. సంగీత దర్శకుడిగా నేను పని చేసిన తొలి సినిమా 'దేవి'. ఇప్పుడు నటుడిగా మరో దేవత చిత్రానికి వర్క్ చేస్తుండటం ఆనందంగా ఉంది'' అని పేర్కొన్నారు. ఈ సినిమాకి సంగీతాన్నీ ఆయనే అందిస్తుండటం విశేషం



## గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్2025 జ్యూరీలో కీలక మార్పు

హైదరాబాద్: గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025 జ్యూరీ కమిటీలో కీలక మార్పు చోటు చేసుకుంది. స్పెషల్ అవార్డ్స్ జ్యూరీ ఛైర్మన్‌గా తమ్మారెడ్డి భరద్వాజ నియమితులయ్యారు. దర్శకుడు రాఘవేంద్రరావు స్థానంలో ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది.

## 'చథా పచ్చ' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!

చథా పచ్చ' ఓ మలయాళ సినిమా. 'ది రింగ్ ఆఫ్ రౌడీస్' అనేది ఈ సినిమా ట్యాగ్ లైన్. అర్జున్ అశోకన్ .. రోషన్ మాథ్యూ .. విశాక్ నాయర్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, కామెడీనీ .. యాక్షన్ మీ టచ్ చేస్తూ సాగే యాక్షన్ డ్రామా. ఈ ఏడాది జనవరి 22వ తేదీన విడుదలైన ఈ సినిమా, ఈ రోజు నుంచి 'నెట్ ఫ్లిక్స్'లోకి స్ట్రీమింగ్ కి వచ్చింది. అద్వైత్ నాయర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మలయాళంతో పాటు తెలుగు ..తమిళ .. కన్నడ .. హిందీ భాషల్లోను అందుబాటులోకి వచ్చింది.సావియో (అర్జున్ అశోకన్) వెట్రి (రోషన్ మాథ్యూ) లిటిల్ (ఇషాన్ షౌకత్) ముగ్గురూ అన్నదమ్ములు. చిన్నప్పటి నుంచి ఈ ముగ్గురికీ 'కుస్తీ' పోటీలపట్ల ఆసక్తిగా ఉండేది. ఆ ఊర్లో జరిగే కుస్తీ పోటీలలో 'మాని'కి తిరుగుండేది కాదు. అలాంటి అతణ్ణి ఎక్కడి నుంచో వచ్చిన 'వాల్టర్' (మమ్ముట్టి) ఓడిస్తాడు. అప్పటి నుంచి అక్కడివాళ్లకు అతను హీరో అవుతాడు. ఈ ముగ్గురు అన్నదమ్ములు కుస్తీలో అతని దగ్గరే శిక్షణ పొందుతారు.

ఆ తరువాత కాలంలో ఈ ముగ్గురు అన్నదమ్ముల దారులు వేరైపోతాయి. మిగతా ఇద్దరు సోదరులను వెతుక్కుంటూ తన సొంత ఊరుకి 'లిటిల్' చేరుకుంటాడు. సావియో ఒక 'లాంచ్' పై పనిచేస్తూ రోజులు గడుపుతూ ఉండటం చూస్తాడు. వెట్రి ఏడెనిమిదేళ్లుగా జైల్లో శిక్షను అనుభవిస్తున్నాడని తెలుసుకుని షాక్ అవుతాడు. వెట్రికి జాస్మిన్ తో వివాహం జరిగిందనీ, సావియో దగ్గర పెరుగుతున్న 'రోసా', వెట్రి కూతురని తెలుసుకుంటాడు.

ఆ ఊళ్లో రాజకీయంగా శివన్ చక్రం తిప్పుతూ ఉంటే, 'కుస్తీ'కి సంబంధించి తనదే పైచేయి అని 'చెరియన్' నిరూపించుకుంటూ ఉంటాడు. మళ్లీ 'కుస్తీ'ని మొదలుపెట్టి తామేంటనేది నిరూపించాలనే లిటిల్ నిర్ణయాన్ని సావియో సమర్థిస్తాడు. అయితే అందుకోసం జైలు నుంచి వెట్రిని విడిపించాలంటే భయపడతాడు. అందుకు కారణం ఏమిటి? చెరియన్ ను వాళ్లు ఎలా ఎదుర్కుంటారు? అన్నదమ్ముల ఆశయం ఫలిస్తుందా? అనేది మిగతా కథ.

స్పోర్ట్స్ నేపథ్యంలో గతంలో మలయాళంలో చాలానే సినిమాలు వచ్చాయి. ఈ కథ 'కుస్తీ' పోటీల చుట్టూ తిరుగుతుంది. 90లలో విపరీతమైన క్రేజ్ ఉన్న 'డబ్ల్యూ డబ్ల్యూ ఈ'ని మనకి మరోసారి గుర్తుకు చేస్తుంది. 'కుస్తీ' పట్ల ఆసక్తి ఉన్న ముగ్గురు అన్నదమ్ములు, తమ కలను నిజం చేసుకోవడం కోసం, ఎలాంటి అవరోధాలను అధిగమించారనే ఒక అంశం చుట్టూ ఈ కథ తిరుగుతుంది.

ముగ్గురు అన్నదమ్ముల బాల్యం .. కుస్తీ పోటీల పట్ల వాళ్లకి ఇష్టం ఏర్పడటానికి కారణం .. వాళ్ల దారులు వేరైన తీరు .. చెరియన్ తో గొడవ .. ఇలా కొంత వరకూ ఈ కథ ఆసక్తికరంగానే నడుస్తుంది. వెట్రి జైలుకు ఎందుకు వెళ్లాడు? అతను తిరిగొస్తాడని తెలిసి సావియో ఎందుకు భయపడుతున్నాడు? అనే అంశాలు ఈ కథను మరింత ఉత్కంఠభరితంగా మారుస్తాయి. ఇక మరో వైపు నుంచి చెరియన్ విలనిజం కూడా టెన్షన్ పెడుతూ ఉంటుంది.

ఇక వెట్రి జైలుకు వెళ్లడానికి ముందు 'జాస్మిన్' అనే యువతిని ప్రేమించి, ఆమె ఇంట్లోవాళ్లకి ఇష్టం లేకపోయినా పెళ్లి చేసుకుంటాడు. దాంతో అతనిపై జాస్మిన్ సోదరులు ఇద్దరూ కోపంతో ఉంటారు. వాళ్ల వైపు నుంచి కూడా సావియోకి ఆపద పొంచి ఉంటుంది. ఇలా ఇన్ని వైపులా నుంచి కథను అల్లుకుంటూ వచ్చారు. అయితే అది కొంతదూరం వరకే. ఆ తరువాత కథ అంతా వరుస కుస్తీ పోటీలతో విసుగు తెప్పిస్తుంది.

క్రీడలకు సంబంధించిన కథల విషయంలో కచ్చితంగా ఒక క్లారిటీ ఉండవలసిన అవసరం కనిపిస్తుంది. ఆటను ఎంతవరకూ చూపించాలి. ఆ ఆట చుట్టూ ఎమోషన్స్ ను ఎక్కడి వరకూ అల్లుకోవాలి? అనే విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టవలసి ఉంటుంది. అప్పుడప్పుడు ఆటను టచ్ చేస్తూ, మిగతా వినోదపరమైన అంశాల వైపు వెళ్లవలసి ఉంటుంది. లేదంటే నిజమైన గేమ్ ను చూస్తున్నట్టుగా అనిపిస్తుంది.

'చథా పచ్చ' అంటే 'డూ ఆర్ డై' అనే అర్థం వస్తుంది. కాలంలో కాస్త వెనక్కి వెళ్లి జరిగే కథ ఇది. ఒక దశ తరువాత 'కుస్తీ' పోటీలపై మాత్రమే పూర్తి ఫోకస్ చేశారు. ఆటకి తగినట్టుగానే అరుపులు .. కేకలు .. గందరగోళ వాతావరణంలో ఈ కథ నడుస్తుంది. ఉత్కంఠను రేపే ట్విస్టులేవీ తగలవు. ఈ కంటెంట్ ఒక వర్గం ప్రేక్షకులకు మాత్రమే కనెక్ట్ అవుతుంది.



మిగతా ఆడియన్స్ కి అంతగా పట్టుకోదు. ఈ కథ చివర్లో అతిథి పాత్రలో మమ్ముట్టి కనిపిస్తారు. కథ మొదలైన దగ్గర నుంచి ఆ పాత్ర ప్రస్తావన కనిపిస్తుందిగానీ, ఆ పాత్ర తెరపైకి వచ్చినందు వలన పెద్దగా ప్రభావం కనిపించదు. ఎమోషన్స్ .. కామెడీ ఏ మాత్రం కనిపించకపోవడం, కథాకథనాలలో బలం లేకపోవడం మరో మైనస్ గా అనిపిస్తుంది. పాత్రలు ఎక్కువైపోవడం .. పాత్రలకి తగిన ప్రత్యేకత .. ప్రాధాన్యత లభించకపోవడం .. గందరగోళ వాతావరణం వలన ఈ కథ ఓ మాదిరిగా అనిపిస్తుందంతే.

## ధోనీ తోటలో 'ఆర్గానిక్' టమోటాలు స్పెషల్





భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీకి వ్యవసాయం అంటే చాలా ఇష్టం. రాంచీకి దగ్గరలోని సాంబో గ్రామంలో ధోనీకి ఫామ్‌హౌస్ ఉంది. అప్పుడప్పుడు ట్రాక్టర్ దున్నుతూ ఉన్న ధోనీ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుంటాయి. దాదాపు 38 ఎకరాల్లో వ్యవసాయం చేస్తుంటాడు. ఈసారి సీజన్‌లో టమోటాపై దృష్టి పెట్టాడు. ఆర్గానిక్ టమోటా రకాలను పండించాడు. పంటను కోసి మార్కెట్‌కు తరలించినట్లు తెలుస్తోంది. దీంతో స్థానికులతోపాటు వ్యాపారుల్లోనూ ఇప్పుడు ఇది హాట్ టాపిక్‌గా మారింది. సైంటిఫిక్ పద్ధతిలో.. అక్కడి నేల, వాతావరణానికి తగ్గట్టుగా టమోటాను ఎంపిక చేసుకుని పండించడం గమనార్హం. ఇందులో రెడ్, లోకల్, చెర్రీ, హైబ్రిడ్ రకాలు ఉన్నాయి. పరిమాణం, రుచి, నాణ్యతపరంగా విశిష్టత కలిగి ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. రాంచీలోని హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ఈ టమోటాలకు డిమాండ్ బాగా పెరిగింది. బయటి నుంచి వచ్చే ట్రేడర్లూ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

**ఫెర్టిలైజర్స్ లేకుండా..**

ధోనీ ఫామ్‌లో పంటలకు ఎలాంటి రసాయన ఎరువులను వాడటం లేదు. క్రిమిసంహారక మందులు కూడా ఆర్గానిక్‌గానే తయారు చేసుకుంటున్నారు. ఆవు పేడను వినియోగిస్తారు. సంప్రదాయ, సహజ సిద్ధమైన పద్ధతులను వాడుతున్నారు. టమోటాలే కాకుండా.. క్యాబేజీ, బఠానీలు, బ్రకోలీ, గుమ్మడి, బెండకాయలు, వంకాయలతోపాటు పైనాపిల్, మామిడి కాయలు, జామ, బొప్పాయ కూడా పండిస్తున్నారు. అయితే, ప్రస్తుతం ఇక్కడ మేలిమిరకం టమోటాలు ప్రధానమైనవి. స్ట్రాబెర్రీలను కూడా పండిస్తుండటం గమనార్హం. ''ఈసారి ఇక్కడ టమోటానే స్పెషల్. ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు లేకుండా పెంచాం. సహజసిద్ధమైనవే వాడాం. మాకు ఈసారి వాతావరణం కూడా సహకరించింది. అందుకే, మంచి దిగుబడి వచ్చింది'' అని ఫామ్ కేర్‌టేకర్ వెల్లడించారు. వ్యవసాయ నిపుణుడు రాజీవ్‌కుమార్ పరిహార్ స్పందిస్తూ ''ధోనీ




కృషి వల్లే సాగు భూమిగా మారింది. అతడి ఆసక్తితో నాణ్యమైన విత్తనాలు వాడాం. దీంతో నాణ్యమైన కూరగాయలు పండుతున్నాయి'' అని తెలిపారు.

## టీ20 ప్రపంచ కప్.. కెనడాపై అఫ్గాన్ ఘన విజయం



చెన్నై: టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా కెనడాతో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ ఘన విజయం సాధించింది. ఇప్పటికే సూపర్ 8కు దూరమైన అఫ్గాన్.. కెనడాపై 82 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసింది. ఇబ్రహీం జద్రాన్ (95*; 56 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగాడు. సెధిఖుల్లా అటల్ (44; 32 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రహ్మానుల్లా గుర్బాజ్ (30; 20 బంతుల్లో 5 ఫోర్లు) రాణించారు. లక్ష్యఛేదనలో కెనడా 118/8 స్కోరుకు పరిమితమైంది. హర్ష్ ఠాకర్ (30) టాప్ స్కోరర్. సాద్ బిన్ జాఫర్ (28), యువరాజ్ సమ్రా (17), దిల్‌ప్రీత్ బజ్వా (13), నికోలస్ కిర్టన్ (10) పరుగులు చేశారు. అఫ్గాన్ బౌలర్లలో మహ్మద్ నబీ (4/7) అదరగొట్టాడు. రషీద్ ఖాన్ 2, ముజీబుర్ రెహమాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్ చెరో వికెట్ తీశారు. కెనడాకు కూడా ఇది చివరి లీగ్ మ్యాచ్. ఆ జట్టు కూడా సూపర్ 8కు అర్హత సాధించలేకపోయింది.

## ఒక్క మార్పు ఉండొచ్చు.. సూపర్ 8లో తొలి పోరుపై గావస్కర్



టీ20 ప్రపంచ కప్‌లో టీమ్ఇండియా సూపర్ 8 పోరుకు సిద్ధమవుతోంది. దక్షిణాఫ్రికాతో ఆదివారం అహ్మదాబాద్ వేదికగా తలపడనుంది. బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌పై ఆడిన అనుభవం టీమ్ఇండియాకు ఉంది. లీగ్ స్టేజ్‌లో నెదర్లాండ్స్‌తో ఇక్కడే విజయం సాధించిన సంగతి తెలిసిందే. అప్పుడు జట్టులోకి వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌ను తీసుకుంది. ఇప్పుడు సూపర్ 8 పోరులోనూ ఒక్క మార్పుతో భారత్ బరిలోకి దిగే అవకాశం ఉందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అంచనా వేశారు. టీ20ల్లో భారత స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఈసారి బెంచ్‌కే పరిమితం చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ''గత మ్యాచ్‌లో అక్షర్ పటేల్‌కు విశ్రాంతి ఇచ్చిన సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికాతో పోరులో మాత్రం తుది జట్టులో ఉంటాడు. ఎవరి స్థానంలో వస్తాడనేది ఆసక్తికరం. నా అభిప్రాయం ప్రకారం.. అర్ష్‌దీప్ సింగ్‌కు బదులు అక్షర్‌కు అవకాశం ఇవ్వొచ్చు. వాషింగ్టన్ సుందర్‌ను కొనసాగించే ఛాన్స్ ఎక్కువ. పిచ్‌పై మరీ ఎక్కువ టర్న్ ఉండదు కాబట్టి కుల్‌దీప్ యాదవ్ కాకుండా.. బ్యాటర్ కమ్ స్పిన్నర్ సుందర్‌ను తీసుకొంటారని భావిస్తున్నా. గతంలో దక్షిణాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లోనూ కుల్‌దీప్ ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేదు. సుందర్ వల్ల తొమ్మిదో నంబర్ వరకూ బ్యాటింగ్ ఆర్డర్ బలంగా ఉంటుంది. అందుకే, అర్ష్‌దీప్ స్థానంలోనే అక్షర్ పటేల్ తుది జట్టులోకి వస్తాడు'' అని గావస్కర్ వెల్లడించారు.

**భారీ అంచనాల వల్లే..**

''అభిషేక్ శర్మ అద్భుతమైన ప్లేయర్. కానీ, అతడిపై భారీగా అంచనాలు ఉండటంతోనే కాస్త ఒత్తిడికి గురవుతున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఒక్క పరుగు కూడా నమోదు చేయలేదు. ఒకవేళ యూఎస్‌ఏతో మంచి ఆరంభం లభించి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. రాబోయే మ్యాచుల్లో తొలి బంతికే సిక్స్ లేదా ఫోర్ కొట్టాలనే తలంపుతో ఆడకూడదు. కాస్త సమయం కేటాయించాలి. భారీ షాట్లకు ప్రయత్నించి సిక్స్ వస్తే ఫర్వాలేదు. ఔటైతేనే మళ్లీ ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఫస్ట్ ఒక సింగిల్ తీస్తే చాలు. అందుకోసం నాలుగైదు బంతులు వృథా అయినా ఫర్వాలేదు. తర్వాత దంచేస్తాడు'' అని సునీల్ గావస్కర్ తెలిపారు.

# ఉత్సాహంగా కొనసాగుతున్న తెలంగాణ పోలీసు క్రీడోత్సవాలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న పోలీసు క్రీడాకారులు



కబడ్డీలో పోటీ పడుతున్న పోలీసు మహిళా క్రీడాకారులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి : సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని పరేడ్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న 4వ తెలంగాణ రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 రెండవ రోజు గురువారం ఉత్సాహంగా సాగింది.**

బుధవారం రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ క్రీడోత్సవాల్లో భాగంగా రెండవ రోజు నిర్వహించిన పలు క్రీడల్లో రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాలు, జోన్లు, కమీషనరేట్లు, ప్రత్యేక దళాల నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీపడుతూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. క్రీడోత్సవాల్లో భాగంగా అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, టీమ్ ఈవెంట్స్ సహా పలు విభాగాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది సమిష్టిగా పాల్గొన్నారు. పోలీసు క్రీడోత్సవాల్లో రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన మహిళా సిబ్బంది పెద్దఎత్తున పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రీడోత్సవాల్లో పోటీపడుతున్న పలు యూనిట్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ వాతావరణంతో సైబరాబాద్ కమీషనరేట్ ఉత్సాహబరితంగా కనిపించింది. శనివారం వరకు ఈ క్రీడాపోటీలు కొనసాగనుండగా, మహిళలు, పురుషుల విభాగాల్లో కొనసాగుతున్న పోటీలు సైబరాబాద్ కమీషనరేట్ గ్రౌండ్ తో పాటు ఎల్ బీ స్టేడియం, గచ్చిబౌలి స్టేడియం, హెచ్సీయు. టిజిపిఏ, వట్టినాగులపల్లి టెన్నిస్ అకాడమీ, జింఖానా గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఎప్పుడూ విధి నిర్వహణలో బిజీగా ఉండే రాష్ట్ర పోలీసు శాఖలో క్రీడా సంస్కృతిని బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆసీస్‌తో రెండో టీ20.. ఓడిన భారత మహిళా జట్టు




కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత మహిళా జట్టుకు ఓటమి ఎదురైంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో భారత్‌పై ఆసీస్ 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. అనంతరం భారత్ 9 వికెట్లను కోల్పోయి 144 పరుగులే చేయగలిగింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (36), స్మృతి మంధాన (31), షెఫాలీ వర్మ (29), రిచా ఘోష్ (19) రాణించినా జట్టును గెలిపించలేకపోయారు. ఆసీస్ బౌలర్లలో ఆష్లే గార్డెనర్ 3, కిమ్ గార్త్ 2, అన్నాబెల్ సదర్లాండ్ 2, సోఫీ 2 వికెట్లు తీశారు. తొలి టీ20లో భారత్ గెలిచిన సంగతి తెలిసిందే. ఇక సిరీస్ విజేతను తేల్చే ఆఖరి మ్యాచ్ ఫిబ్రవరి 21న అడిలైడ్ వేదికగా జరగనుంది.

**వోల్ హాఫ్ సెంచరీ..**

టాస్ గెలిచిన టీమ్ఇండియా బౌలింగ్ ఎంచుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' జార్జియా వోల్ (88) అద్భుతంగా హాఫ్ సెంచరీ సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 163 పరుగులు రాబట్టింది. బెత్ మూనీ (46) రాణించింది. పెర్రీ (7), ఫోయబ్ లిట్‌చ్‌ఫీల్డ్ (6) విఫలమయ్యారు. ఆష్లే గార్డెనర్ 10 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అరుంధతిరెడ్డి 2, రేణుకా సింగ్ ఠాకూర్ ఒక వికెట్ తీశారు.

# పొట్టి కప్‌లో మరో సంచలనం.. శ్రీలంకకు షాక్ ఇచ్చిన జింబాబ్వే

**కొలంబో: టీ20 ప్రపంచ కప్‌లో జింబాబ్వే మరో సంచలనం నమోదు చేసింది. గ్రూప్ స్టేజ్‌ను అగ్రస్థానంతో ముగించింది. తొలుత ఆస్ట్రేలియాను ఓడించిన ఆ జట్టు.. లీగ్ స్టేజ్ తమ చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై 6 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఇప్పటికే శ్రీలంక, జింబాబ్వే సూపర్-8కి చేరాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 178/7 స్కోరు చేసింది. అనంతరం జింబాబ్వే బ్యాటింగ్ ప్రారంభించింది. 19.3 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి టార్గెట్‌ను ఛేదించింది. మూడో వికెట్‌కు వీరిద్దరూ కలిసి 40 బంతుల్లోనే 69 పరుగులను జోడించారు. బ్రియాన్ బెనెట్ (63*) హాఫ్ సెంచరీ సాధించగా.. సికందర్ రజా (45) దూకుడుగా ఆడేశాడు. 19వ ఓవర్‌లో హేమంత రెండు వికెట్లు తీసి జింబాబ్వేను కాస్త భయపెట్టాడు. అయితే, బెనెట్‌తో కలిసి మున్యాంగా (8*) విజయతీరాలకు చేర్చాడు. శ్రీలంక బౌలర్లలో హేమంత 2.. వెల్లలాగే, శనక చెరో వికెట్ తీశారు.**









**నిశాంక హాఫ్ సెంచరీ..**

అంతకుముందు టాస్ నెగ్గిన శ్రీలంక బ్యాటింగ్ ఎంచుకుంది. పాథున్ నిశాంక (62) హాఫ్ సెంచరీ సాధించడంతో.. శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. పవన్ రత్నాయకే (44), కుశాల్ పెరీరా (22) రాణించారు. కుశాల్ మెండిస్ (14), కమిందు మెండిస్ (7), దాసున్ శనక (6) విఫలమయ్యారు. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని 2, గ్రీన్ క్రెమెర్ 2, ఇవాన్స్ 2, బర్ల్ ఒక వికెట్ తీశారు.

**టీమ్ఇండియాకు వార్నింగే..**

ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా జింబాబ్వే సూపర్ 8లో అడుగుపెట్టింది. మూడు మ్యాచుల్లో విజయం సాధించగా.. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. పెద్ద జట్లకు షాక్ ఇచ్చిన జింబాబ్వే ఆటతీరుతో ఇప్పుడు భారత్‌కు సవాల్ తప్పదని క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎందుకంటే సూపర్ 8లో జింబాబ్వే మన గ్రూప్‌లోనే ఉంది. విండీస్, దక్షిణాఫ్రికాతోనే కాకుండా జింబాబ్వే కూడా గట్టిపోటీనివ్వడం ఖాయమని తెలుస్తోంది. ఫిబ్రవరి 26న జింబాబ్వేతో భారత్ ఆడనుంది.

